క్లుప్తంగా

జిల్లాస్థాయి క్రీడలకు 8మంది ఎంపిక

నల్లజర్ల: జిల్లా స్థాయి ఆటల పోటీలకు తమ పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రకాశరావుపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్ఎం జయశంకర్ తెలిపారు. 18,19 తేదీలలో నియోజకవర్గ స్థాయిలో దేవరపల్లి, దుద్దుకూరులలో జరిగిన పోటీల్లో వీరు పాల్గొంటారు. చెస్ పోటీలకు ఎ.శ్రావణి, సంఘవి, 100 మీటర్ల పరుగు పందెంలో యస్.ఆనంద్, వాలీబాల్, రన్నింగ్‌కు దుర్గా హేమంత్, కె.ప్రవీణ్, కబడ్డీకి యస్.పార్వతి, ఖోఖోలో చిన్నబాబు ఎంపికయ్యారన్నారు.

పోషకాహారంపై విద్యార్థులకు పోటీలు

కొవ్వూరు: పోషకాహార వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో సంస్కృత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోషకాహారం బాలింతలకే కాకుండా చిన్నతనం నుంచి పిల్లలకు కుడా అందించాలని సీడీపీవో డి.మమ్మి సూచించారు. తక్కువ ఖర్చుతో ఇంట్లోనే పోషకాహారం తయారు చేసుకునే విధానం గురించి విద్యార్థులకు వివరించారు.అనంతరం వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతకలు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాస మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉదయభాను, ఎంఎస్‌కే వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో విద్యార్థుల సత్తా



పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

తాళ్లపూడి: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ చాంపియన్ షిప్-2024 కరాటే పోటీల్లో అన్నదేవరపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అన్నదేవరపేటలోని సన్‌లైట్ స్కూల్ నుంచి పది మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా అందులో ఆరుగురు అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచారన్నారు. ఎస్‌కే దఫిక్, జి.వర్షిత్‌లు సిల్వర్ మెడల్, ఎస్‌కే గాలిబ్, జి.చైతన్య, కె.సుశాంత్, కె.వర్షిణిలు బ్రాస్ మెడల్ సాధించినట్టు కరస్పాండెంట్ సిద్ధు తెలిపారు. విద్యార్థులను, కరాటే ట్రైనర్ ఆళ్ల రాధలను ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

నిడదవోలు: స్థానిక సంతమార్కెట్‌లో అనాధికార డంపింగ్ యార్డ్‌ను తొలగించకుంటే ఈనెల 27న చెత్త, వ్యర్థాలతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ పలుమార్లు ధర్నాలు చేసి వినతిపత్రాలు అందిస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ ప్రాతినిధ్యం వహించే నిడదవోలు పట్టణంలోని ముఖ్య కూడలిలో అనధికార డంపింగ్ చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ఆటలాడుతూ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాంబాబు విమర్శించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


కొవ్వూరులో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న నాయకులు

తాళ్లపూడి: విజయవాడ వరద బాధితుల సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను తాళ్లపూడి మండల టీడీపీ సీనియర్ నాయకులు కొటారు వెంకట్రావు అధ్వర్యంలో రూ.లక్షా19 వేలను గురువారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, తాళ్లపూడి మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నిడదవోలు : స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న ఐదో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతి దాడు. అనారోగ్యంతో గాని ఇతర కారణాలతో సహజ మరణం పొందాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు కాటన్ లుంగీ, కాషాయి రంగు టవల్‌తో పాటు మెడలో రుద్రాక్షమాల ధరించాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెచ్‌సీ డి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుని వివరాల కోసం 7013360296, 9948010061 నంబర్లకు సంప్రదించాలని రైల్వే హెచ్‌సీ డి.శ్రీనివాసరావు తెలిపారు.


క్రేన్ సహాయంతో వినాయకుడి విగ్రహాన్ని కాలువలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


నిడదవోలు పట్టణంలో 15 అడుగుల భారీ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


దేవరపల్లిలో గణపతి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

గంగమ్మ ఒడికి గణపయ్య..

- ముగిసిన చవితి వేడుకలు
- గణనాథునికి వీడ్కోలు
- క్రేన్ సహాయంతో 15 అడుగుల విగ్రహాన్ని ఓవర్‌బ్రిడ్జి పై నుంచి కాలువలో నిమజ్జనం

నిడదవోలు: పట్టణంలో గణేశ్‌చౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీపూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంస వాహనంపై ఉంచి ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో వినాయకుడి విగ్రహాన్ని హంసవాహనంపై ఉంచారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, విగ్రహదాత ఉప్పులూరి వీరభద్రరావు కొబ్బరికాయలు కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. యువత చిందులు, డీజే సౌండ్స్, సన్నాయి మేళాలు, శక్తి వేషాలు, ప్రత్యేక మ్యూజికల్ బ్యాండ్‌లు, కేరళ నృత్యాలు, కోయిడాన్స్, కోలాటం, బుట్ట బొమ్మలు, కాళికా మాత నృత్య ప్రదర్శన, గరగల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం క్రేన్ సహాయంతో స్థానిక ఓవర్ బ్రిడ్జి పైనుంచి చినకాశి రేవులో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో విగ్రహన్ని నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చేటుచేసుకోకుండా నిడదవోలు సీఐ వి. శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై పి. శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీసు భద్రతా చర్యలు చేపట్టారు.


అన్నవరప్పాడులో పూలవాహనంపై వినాయకుడు


ఆకట్టుకున్న వేషధారణలు

ఘనంగా గణపతి ప్రతిమల ఊరేగింపు

దేవరపల్లి: మండలంలోని గణపతి విగ్రహాలను ఘనంగా ఊరేగించి కాలువలు, నదుల్లో నిమజ్జనం చేస్తున్నారు. గురువారం దేవరపల్లి నిమ్మలపాటిదిబ్బలు ప్రాంతంలోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించి పూజలు నిర్వహించిన ప్రతిమను ప్రత్యేకంగా అలంకరణ చేసిన హనుమంతుని రథం పై ఉంచి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఉదయ 10 గంటల నుంచి రాత్రి వరకూ ఊరేగింపు సాగింది. పలు గ్రామాల్లో నమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించడానికి గ్రామానికి చెందిన ఆకుల సీతయ్య కుమారులు రూ.77,400లకు వేలంలో పాడుకున్నారు.


అన్నవరప్పాడులో అష్టలక్ష్మీల వినాయకుడు

ఉత్సాహంగా సాగిన ఊరేగింపులు

పెరవలి: అన్నవరప్పాడులో వినాయక విగ్రహాలను ఘనంగా ఊరేగించి, అనంతరం నిమజ్జనం చేశారు. గ్రామంలో ఒకేసారి 8 వినాయక విగ్రహాలు ఊరేగింపుగా తీసుకెళ్లి కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయక లడ్డూలు వేలం నిర్వహించగా రూ.10,300 వెళ్లింది.

కిశోర బాలికల సైకిల్ ర్యాలీ

నల్లజర్ల: గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో నల్లజర్ల జెడ్పీహైస్కూలులో గురువారం బేటీ బచావో-బేటీ పడావో, బాల్యవివాహల కలిగే అనర్ధాలు, పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లను రక్షిద్దాం, ఆడపిల్లను చదివిద్దామంటూ నినాదాలు చేశారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. బాలింతలు, గర్భిణులు చిన్నారులు పోషకాహారం సక్రమంగా తీసుకోకపోవడం వల్ల రుగ్మతలను వివరించారు. పోషహాకార లోపం నివారణకు రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రధానంగా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం కోమలిచిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు యం.శాంతవల్లి, కె.ప్రేమావతి, ఎస్.శివకుమారి, టి.దేవి, డ్వాక్రా గ్రూపు సీఏలు పి.శ్రీదేవి, కె.పద్మ, ఎం.పద్మజ పాల్గొన్నారు.


నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

కూరగాయల ధరలకు రెక్కలు

- ప్రజలను బెంబేలెత్తిస్తున్న కూరగాయల ధరలు
- ఏది కొనాలన్నా కిలో రూ. 80
- ఉల్లిపాయలు కిలో రూ. 70

దేవరపల్లి: కూరగాయల ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఒక పక్క నిత్యావసర సరకుల ధరలు మండిపోతుండగా, మరొక పక్క కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. దాదాపు నెల రోజుల నుంచి కూరగాయల ధరలు మండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది కొనాలన్నా కిలో రూ.70 నుంచి 120 పలుకుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబరుల్లో కురిసిన భారీ వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతినడంతో కూరగాయల కొరత ఏర్పడి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. కిలో ఉల్లిపాయలు రూ.70, వంకాయలు రూ.100, బెండకాయలు రూ. 80, చిక్కుడు రూ. 120, ఆగాకర రూ.160, పచ్చమిర్చి రూ.60, బీరకాయలు రూ.40, బెండ, దొండ, కాకర కాయలు కిలో రూ.60, దోస రూ.50 పలుకుతున్నాయి. దీంతో ఎక్కువగా ఆకుకూరలను కొనుగోలు చేయడంతో వాటి ధరలు కూడా పెరిగాయని ప్రజలు వాపోతున్నారు. మరొక నెల రోజులు ధరలు ఇదే విధంగా ఉంటాయని వ్యాపారులంటున్నారు. ధరలు ఈ విధంగా ఉంటే ఏమి తిని బతకాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు వంట నూనెల ధరలు దారుణంగా పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వంట నూనెలపై దిగుమతి సుంకం 20 శాతం పెరగడంతో కిలో వంట నూనె ధర రూ. 160 పలుకుతుందని ప్రజలు వాపోతున్నారు. ఒకే సారి కిలోకు రూ.30 పెరిగినట్టు వ్యాపారులు తెలిపారు. చిల్లర వ్యాపారులు మరింత లాభం వేసుకుని అమ్మకాలు జరుపుతున్నారు. ఉల్లిఘాటుకు, వంట నూనెల చలచల కాగుడుకు కూరలు వండాలంటే మహిళల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి.


దేవరపల్లిలో కూరగాయల దుకాణం

కండక్టర్ ప్రసాదరావుకు జాతీయ పురస్కారం

గోపాలపురం: ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ గవర్నర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కండక్టర్ డాక్టర్ కొలూరి ప్రసాదరావుకు జాతీయ ప్రతిభా పురస్కార్ అవార్డు లభించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు గురువారం ప్రసాదరావు తెలిపారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన కవులు, కళాకారులకు మెమెంటో, మెడల్, జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. పుడమి సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఉభయ రాష్ట్రాలకు చెందిన ప్రతిభా వంతులకు పురస్కారం అందజేసినట్టు చెప్పారు. డాక్టర్ కొలూరి ప్రసాదరావు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఉషాపక్ష పత్రిక నిర్వహించిన కథల పోటీల్లో లవ్ అండ్ రొమాన్స్ అనే కేటగిరిలో ఉద్దతుల మధ్య అనే కథకు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ప్రసాదరావు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ సాహిత్యం, చదరంగంలో రాణిస్తున్న ప్రసాదరావును పలువురు అభినందించారు.


హైదరాబాద్‌లోని గవర్నర్ నివాసంలో అవార్డు అందుకుంటున్న కండక్టర్ ప్రసాదరావు

హాస్యనటుడు రేలంగి విగ్రహావిష్కరణ

సీటీఆర్ఐ: గోదావరి గట్టుపై గౌతమీ నందన వనం దగ్గర రాజమండ్రి గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన హాస్యనట చక్రవర్తి రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సమయ స్ఫూర్తితో హాస్యం పండించడంలో రేలంగి వెంకట్రామయ్య దిట్ట అన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి హాస్యనటుడు రేలంగి అని కొనియాడారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ తన తండ్రి ఎన్టీఆర్‌తో రేలంగికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మిస్సమ్మ సినిమాలో ఎన్టీఆర్, రేలంగి నటనకు సంబంధించిన డైలాగులను ఎంపీ పురందేశ్వరి ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

అధికారం చూసి విర్రవీగుతున్న కూటమి నాయకులు

పెరవలి: అధికార పార్టీ నాయకుల ఆగడాలు, దౌర్జాన్యాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. గురువారం అన్నవరప్పాడులో వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త ఓసూరి నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులపై వాట్సాప్‌లో దారుణమైన పోస్టులు పెడుతున్నారు. అలాగే నిమజ్జనం సమయంలో దుర్భషలాడాడు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్సై అప్పారావుకు ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావుని అరెస్టు చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని అన్నారు. అయితే నాగేశ్వరరావు పరారయ్యాడు. ఎస్సై మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామని, ఎక్కడ ఉన్నా వెంటనే పోలీసు స్టేషన్‌కు తీసుకు వస్తామని తెప్పడంతో వైఎస్సార్ సీపీ నాయకులు శాంతించారు.

పొగాకు రైతులకు అవగాహన సదస్సు

దేవరపల్లి: పొగాకు పంటపై పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా గుర్తించినట్టు బోర్డు విస్తరణాధికారి దామోదర్ అన్నారు. స్థానిక వేలం కేంద్రం వద్ద గురువారం జీవశిలీంధ్ర నాశినిల ఉత్పత్తి చేసేందుకు గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత అధ్యక్షత వహించగా గుంటూరు పొగాకు బోర్డు విస్తరణాధికారి దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొగాకు పంటకు ఎక్కువగా పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయన్నారు. దీనివల్ల పొగాకు ఎగుమతులకు ఆటంకం ఏర్పడుతుందని, దీనిని గమనించి రైతులు పురుగు మందుల అవశేషాలు లేని పంటను ఉత్పత్తి చేయాలన్నారు. అవశేషాలు లేని జీవశిలీంధ్ర నాశినిలను వాడాలన్నారు. బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒకే పంట వేయడం వల్ల భూమిలోని సారం పోతుందన్నారు. ప్రతి రైతు జీవసంబంధిత ఎరువుల వాడకం వల్ల భూమికి సారం వస్తోందన్నారు. రైతులు తమ క్షేత్రంలో తయారు చేసిన జీవ సంబంధిత ఎరువులను వాడాలన్నారు. ఎస్ఐపీహెచ్ఎం శాస్త్రవేత్త దామోధరాచారి మాట్లాడుతూ ట్రైకోడెర్మా, సూడోమోనస్, పొటాషియం రిలీజింగ్ బాక్టీరియా(కేఆర్‌బీ)లను క్షేత్రస్థాయిలో ఉత్పత్తి, తయారీ విధానం వివరించి ప్రదర్శించారు. తయారు చేయు పద్ధతిని రైతులకు చూపించారు. వేలం నిర్వహణాధికారి హేమస్మిత మాట్లాడుతూ ఇండెంట్ ఇచ్చిన రైతులు ట్రైకోడెర్మా, సూడోమోనస్, కేఆర్‌బీలను తీసుకువెళ్లాలన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని పొగాకు పండించి మార్కెట్లో మంచి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ సదస్సులో రైతులు, వేలం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జీఎల్‌కే ప్రసాద్

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండమని నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు సూచించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న చెత్తను గుర్తించి డంపింగ్ కేంద్రాలకు తరలించాలని ఎంపీడీఓ పి.శామ్యూల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ ఈ.రత్నరాజు, పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు, అధికారులు

నేడు మండల సమావేశం

కొవ్వూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.సుశీల తెలిపారు. మండలంలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్టు ఆమె తెలిపారు. ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సాముహిక కుంకుమ పూజలు

కొవ్వూరు: పట్టణంలో మెరకవీధి వాటర్‌ట్యాంకు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక శిబిరం వద్ద శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు సాముహిక లక్ష్మీ గణపతి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు రౌండ్ రామాలయం యూత్ కమిటీ ప్రకటించింది.కుంకుమ పూజకి వచ్చే మహిళా భక్తులకు అవసరమైన పూజా ద్రవ్యాలన్నీ కుమారి గేదెల భావన అందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.కావున మహిళా భక్తులంతా ఈ కుంకుమ పూజలకు హాజరు కావాలని కోరారు.సోమవారం శిబిరం వద్ద భారీ అన్నసమారాధన, అనంత రం స్వామి నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

గణపతి లడ్డూ వేలం రాబడి రూ.19,500

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం నెహ్రూ బొమ్మసెంటర్ ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదానికి గురువారం వేలం పాట నిర్వహించారు. 9 కేజీల లడ్డూను నిడదవోలుకు చెందిన చక్కా గంగారత్నం రూ.19,550లకు దక్కించుకోగా, 6 కేజీల లడ్డూను హైదరాబాద్‌కు చెందిన కొండవీటి రాజ్యలక్ష్మి రూ.9,500లకు దక్కించుకున్నారు. బాలగణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూలను అందజేసి వారిని అభినందించారు.


లడ్డూను గంగారత్నంకు అందజేస్తున్న బాలగణేష్ యూత్ సభ్యులు

భారీ అన్న సమారాధనలు

తాళ్లపూడి: గ్రామాల్లో వినాయక చవితి ముగింపు సందర్భంగా అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రక్కిలంక, వేగేశ్వరపురంలో వినాయక నమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అదేవిదంగా అన్నదేవరపేటలో లక్ష్మీగణతి వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 4 వేల మంది వరకు పాల్గొన్నారు. యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూలకు వేలం నిర్వహించారు. అనరంతరం ఆధ్యాత్మిక ప్రవచన కర్త పరస రాధాకృష్ణను సత్కరించారు.